క్లుప్తంగా

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి

తిరుపతి కల్చరల్ : చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 400 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రావు, కోశాధికారి జి.శివయ్య, మునస్వామి పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండవ విడత వెబ్ ఆప్షన్లు

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్ తొలి విడత తొలి విడతలో ఎస్వీయూ పరిధిలో 14,352 మంది విద్యార్థులు సీట్లు సాధించి తమకు కేటాయించిన కళాశాలలో ప్రవేశాలు పొందారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా రెండవ విడత సీట్ల కేటాయింపు కోసం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సోమవారం నుంచి కొనసాగనుంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రక్రియపై సందేహాలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఏపీఈఏమ్‌సెట్–2025 కౌన్సెలింగ్ సెంటర్ నందు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

గోల్‌మాల్....గోవిందం...!

- ఎస్వీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు అస్తవ్యస్తం
- 150కిపైగా మిగిలిపోయిన సీట్లు
- కటాఫ్ అంటూ వెనక్కు పంపారు


ఎస్వీ జూనియర్ కళాశాల


స్పాట్ అడ్మిషన్ల కోసం వేచిఉన్న విద్యార్థులు తల్లిదండ్రులు

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు కొనసాగిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ అస్తవ్యస్తంగా ముగిసింది. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సుదూర ప్రాంతాల నుంచి హాజరైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది. కళాశాలలో ఎంపీసీ గ్రూప్ మినహా మిగిలిన అన్ని గ్రూప్‌లలో ఖాళీలు ఉన్నాయంటూ డిస్‌ప్లే బోర్డులో స్పష్టంగా వివరాలు తెలుస్తోంది. కానీ టీటీడీ అధికారుల ఆదేశాల ప్రకారం 400పైబడి మార్కులు సాధించిన వారికి మాత్రమే సీట్లు అంటూ హల్‌చల్ చేశారు.

150కి పైగా సీట్లు ఖాళీ

ఎస్వీ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 11గంటలకు ప్రవేశాలను ప్రారంభించారు. టీటీడీ అధికారుల ఆదేశాలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగించారు. స్పాట్ అడ్మిషన్లలో శుక్రవారం 91 సీట్లు భర్తీ చేశామని, శనివారం మరో 75కిపైగా సీట్లు భర్తీ చేసినట్లు అధికారులు చెప్పుకొచ్చారు.

కానరాని టీటీడీ అధికారుల పర్యవేక్షణ

ఎస్వీ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు పోటెత్తే అవకాశం ఉందని తెలిసి కూడా టీటీడీ అధికారుల కనీసం తూతూమంత్రంగానైనా తనిఖీలు చేయకపోవడం విశేషం. ప్రవేశాల ప్రక్రియపై కనీసం ఒకసారైనా కళాశాలను సందర్శించాల్సిన టీటీడీ డీఈఓ కనుచూపు మేర కనిపించలేదు. పైస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కళాశాల అధికారులు తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

మిగిలిన సీట్ల వివరాలు	
ఎంపీసీ	నిల్
ఎంఈసీ (ఇంగ్లీషు మీడియం)	15
బైపీసీ (ఇంగ్లీషు మీడియం)	16
సీఈసీ (ఇంగ్లీషు మీడియం)	40
హెచ్ఈసీ (ఇంగ్లీషు మీడియం)	40
సీఈసీ (తెలుగు మీడియం)	53
హెచ్ఈసీ (తెలుగు మీడియం)	60

నిబంధనల ప్రకారమే ప్రవేశాలు

టీటీడీ అధికారులు మాకు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే స్పాట్ అడ్మిషన్లు నిర్వహించాం. ఎలాంటి ఒత్తిడికి తలొగ్గకుండా నిబంధనల ప్రకారం ప్రవేశాలు చేపట్టాం. టీటీడీ అధికారులు కటాఫ్ మార్కులు 400గా నిర్ణయించారు. నిబంధనలు అతిక్రమించలేదు.

–ప్రకాష్ బాబు, ప్రిన్సిపల్, ఎస్వీ జూనియర్ కళాశాల

తల్లిదండ్రుల అవస్థలు వర్ణనాతీతం

కళాశాల ఆవరణలో ప్రవేశాల కోసం వేచి ఉండేందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు మౌలిక వసతుల కల్పనలో కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. తల్లిదండ్రులు కళాశాల ఆవరణలోని చెట్ల కిందనే సేదదీరాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రధానంగా తమ పిల్లల ప్రవేశాల కోసం విచ్చేసి ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటలకు వేచి ఉన్న మాతృమూర్తులకు వాష్‌రూమ్ సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌పై అవగాహన

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం అధీనంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్' పై అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు చెందిన సీనియర్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ నిపుణులు డాక్టర్ శ్రీధర్‌నాయుడు అవగాహన కల్పించారు. శనివారం యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేషన్ వారు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. శ్రీధర్ నాయుడు 'ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్' పై సూచనలు, సలహాలు అందించారు. అలాగే ఇంజినీరింగ్ విద్యార్థి అసోసియేషన్ల ప్రాముఖ్యం గురించి వివరించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల గురించి వివరించి, విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం అనుసరించాల్సిన మార్గాలను విశదీకరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.మల్లికార్జున, కోఆర్డినేటర్, అసోసియేషన్ అధ్యక్షురాలు డా. డి. హిమబిందు ఉపాధ్యక్షురాలు డా.ఎస్. శృతి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డి.నర్మిత, కార్యదర్శి సిహెచ్.సిరి చందనా, సహాయ కార్యదర్శులు సివి. స్వేత, బి.వి.వి. సంగణశ్రీలు పాల్గొన్నారు.

గాజులమండ్యంలో భూవివాదం


అధికారులకు తమ గోడును తెలుపుతున్న బాధితులు

రేణిగుంట : మండలంలోని గాజుల మండ్యంలోని ప్రధాన రహదారికి ఆనుకొని గ్రామానికి చెందిన దొరై రాజుకు 1047 చదరపు అడుగుల స్థలం ఉంది. అందులో 927 చదరపు అడుగుల స్థలం తిరుపతి చెన్నై హైవే విస్తరణ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నష్ట పరిహారం చెల్లించింది. హైవే పనులు పూర్తయిన అనంతరం మిగిలిన స్థలంలో షాప్ పెట్టుకోవాలని ఆ కుటుంబం ఎదురుచూస్తోంది. ఇంతలో వీరికి వెనుక నివాసం ఉన్న టీడీపీ నేత కన్ను ఆ స్థలంపై పడింది. ఆ స్థలాన్ని ఆక్రమిస్తే తన ఇల్లు రోడ్డుకు వస్తుందన్న దురాశతో రెండు నెలలుగా ఆ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి భూమిని సొంతం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ సీఐ మంజునాథరెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి జేసీబీతో బాధితుడి స్థలంలో ఉన్న గోడను కూల్చేందుకు ప్రయత్నించారు. బాధితుడి భార్య మునెమ్మ జేసీబీకి అడ్డుగా కూర్చోవడంతో గ్రామస్తులు అధికారుల చర్యలను తప్పుపట్టి బాధితురాలికి అండగా నిలిచారు. బాధితుడి కుమారుడు మునేంద్ర మాట్లాడుతూ.. స్థలానికి సంబంధించి తమ వద్ద పత్రాలు ఉన్నాయన్నారు. అధికార బలంతో ఆక్రమించాలని ప్రయత్నిస్తే ఊరుకోమన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం సబ్ డివిజన్‌కు అనుమతి

తిరుపతి రూరల్: జాయింట్ ఎల్‌పీఎం(ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సబ్ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం మళ్లీ అనుమతించిందని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయింటు హక్కుదారులుగా ఉన్న భూములపై తరచూ వివాదాలు చోటు చేసుకోవడంతో పాటు అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ పథకాలను రైతులు పొందలేకపోతున్నారన్న ఫిర్యాదులతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గతంలో జూన్ 30కి ముగింపు తేదీగా ప్రకటించినప్పటికీ మరొక అవకాశం కల్పిస్తూ డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించిందన్నారు. జాయింట్ ఎల్‌పీఎంల సబ్ డివిజన్ చేసుకునేందుకు రైతులు గ్రామ సచివాలయాల్లో రూ.50 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'పంచగవ్య' శ్రేయస్కరం

తిరుపతి రూరల్ : పంచగవ్య ఉత్పత్తులతో మానవాళి మనుగడ శ్రేయస్కరమని ఐసీఎస్ఎస్ఆర్ నిపుణులు డాక్టర్ హర్షభార్గవి పేర్కొన్నారు. పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ఉమెన్ ఐసీటీ ఫ్రాంటెయిర్ ఇనిషియేటివ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మర్ , భారత్ ఏకం సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సంస్థలతో కలిసి ''సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ – సాంస్కృతిక మూలాల నుంచి ఆర్థిక మార్గాలవైపు'' అనే అంశంపై ఒక్కరోజు సదస్సును నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం పంచగవ్య ఆధారిత వ్యవస్థాపకతపై ప్రధానంగా సాగింది. తక్కువ పెట్టుబడితో ఉత్పత్తులను ఎలా తయారు చేసుకోవచ్చనే విషయాలపై విద్యార్థులకు తెలియజేశారు. యూనివర్సిటీ అధ్యాపకులు విజయలక్ష్మి, పీఎం ఉషా ప్రాజెక్టు సభ్యులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలకు ఫీజు చెల్లించండి

తిరుపతి సిటీ : సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల నిర్వహణ కోసం సీబీఏ విధానంలో 1 నుంచి 10వ తరగతి వరకు ఓఎంఆర్ షీటుతో పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలకు సైతం ప్రభుత్వం ప్రశ్నపత్రాలను అందించనుంది. ఇందులో భాగంగా ప్రతి ప్రైవేటు పాఠశాల అందుకు సంబంధించిన రుసుం చెల్లించాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను పీక్కుతింటోంది. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు రూ.140, 6, 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.160, 8 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు రూ. 190 తక్షణం చెల్లించాలని హుకుం జారీ చేసింది. దీంతో ఏడాదిగా లక్షలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను అప్పులు పాలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు కనీసం ప్రశ్నపత్రాలకు సంబంధించి ఫీజు చెల్లించకుండా తమపై రుద్దుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం


ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మైఖేల్ బెన్‌హర్, జిల్లా అధికారులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఏఎల్‌సీఎం ఆటస్థలం ఆవరణలో శనివారం నుంచి రెండు రోజుల పాటు అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముందుగా ఎస్ఏఎల్‌సీ మాజీ బిషప్ మైఖేల్ బెన్‌హర్‌తో పాటు ఫుట్‌బాల్ జిల్లా సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఈ పోటీలలో తిరుపతి, నెల్లూరు,వైఎస్సార్ కడప తదితర జిల్లాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారిణులు పాల్గొంటున్నట్లు కోచ్ గౌస్‌బాషా తెలిపారు. ఈ పోటీలను నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ సారథ్యంలో జిల్లా అధికారులతో కలిసి పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, క్లబ్‌కు చెందిన భావన్ అనుదీప్, సభ్యులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో 'విశ్వం' ప్రతిభ


నవోదయ ఫలితాలలో ప్రతిభ చూపిన విశ్వం విద్యార్థులు

తిరుపతి సిటీ : జాతీయ స్థాయిలో 2025–2026 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ 3వ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 69 మంది విశ్వం విద్యార్థులు సీట్లు సాధించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ ఎన్ తులసీ విశ్వనాథ్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తోందన్నారు.2026 నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల కోసం 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

జనావాసాల్లోకి చిరుతలు రాకుండా చర్యలు

- జూపార్క్ ప్రాంతాల్లో చిరుతల కదలికలు
- రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్లకూడదు
- వైల్డ్‌లైఫ్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం వెల్లడి


మాట్లాడుతున్న తిరుపతి వైల్డ్‌లైఫ్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం

తిరుపతి మంగళం : శేషాచల అటవీ ప్రాంతం నుంచి చిరుతలు జనావాసాల్లోకి రాకుండా చర్యలు చేపడుతున్నామని తిరుపతి వైల్డ్ లైఫ్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం తెలిపారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని అటవీశాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్వీ జూపార్క్ రోడ్డులో నిన్నటి రాత్రి చిరుత సంచారం కలకలం రేపిందన్నారు. ఆ మార్గంలో వెళుతున్న వాహనదారుడిపై చిరుత దాడి చేసేందుకు యత్నించిందని తెలిపారు. అయితే అటు మార్గంలో రాత్రి సమయంలో వెళ్లే వాహనదారులు నలుగురు, ఐదుగురు అలిపిరి సర్కిల్ వద్ద నుంచి కలిసి వెళ్లాలని సూచించారు. ఎస్వీ జూపార్క్ రోడ్డులో అధికంగా ఫుడ్‌స్టాల్స్ ఉన్నాయని, వారు అక్కడే పడవేసే ఫుడ్‌వేస్టేజ్ కోసం కుక్కలు, పందులు, జింకలు వస్తుంటాయని, వాటి కోసం చిరుతలు అక్కడి వస్తున్నాయని తెలిపారు. ఫుడ్‌స్టాల్స్ నిర్వాహకులు వేస్టేజ్‌ను అక్కడ పడవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ రోడ్డు మార్గంలో ఫుడ్‌స్టాల్స్‌కు ఎలాంటి అనుమతి లేదని, వాటిని తొలగించేందుకు టీటీడీ అటవీ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దాంతో పాటు ఎస్వీ యూనివర్సిటీ కళాశాల వద్ద గుట్టలుగా పడవేసే ఫుడ్ వ్యర్థాల కోసం ఇటీవల చిరుతలు ఆ ప్రాంతంలో సంచరించాయన్నారు. దాంతో అక్కడ బోను ఏర్పాటు చేసి చిరుతను పట్టుకోవడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం ఎస్వీ యూనివర్శిటీ, జూపార్క్ రోడ్డు ప్రాంతాల్లో మూడు చిరుతలు సంచరిస్తున్నట్లు సీసీ పుటేజ్‌ల ద్వారా తెలిసిందన్నారు. మూడు చిరుతలతో పాటు వాటి పిల్లలు కూడ ఉన్నట్లు గుర్తించామన్నారు. అలిపిరి సర్కిల్ వద్ద నుంచి రాత్రి వేళల్లో టీటీడీ, అటవీ శాఖ సిబ్బందిని ఏర్పాటు చేసి జూపార్క్ రోడ్డులో వాహనదారులను గుంపులుగా పంపేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే చిరుత కదలికలను తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలో 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎస్వీ యూనివర్సిటీ, జూపార్క్ రోడ్డులో రెండు బోన్లును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిరుతలు జనవాసాల్లోకి రాకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు.

బోన్లు ఏర్పాటు

శేషాచల అడవుల్లో నుంచి జనవాసాల్లోకి వస్తున్న చిరుతలను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తిరుపతి అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఎస్వీయూనివర్శిటీ ప్రాంతంలో రెండు బోన్లు, ఎస్వీ జూపార్క్ రోడ్డులోని అరవింద కంటి ఆసుపత్రి సమీపంలో ఒక బోను ఏర్పాటు చేశామని తెలిపారు.


చిరుతలను పట్టుకునేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్న బోన్లు

క్లుప్తంగా

అరవింద్ కంటి ఆస్పత్రి తనిఖీ

తిరుపతి తుడా: జూపార్క్ రోడ్డులో వున్న శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రిని శనివారం ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈవో కె.దినేష్ కుమార్ తనిఖీ చేశారు. పలు విభాగాలను పరిశీలించారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం అమలుపై ఆరా తీశారు. అనంతరం చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే రెడ్డికి రాష్ట్రీయ పురస్కార్



అవార్డు అందుకుంటున్న డాక్టర్ తాతిరెడ్డి

తిరుపతి సిటీ: ఆర్కే విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి ఢిల్లీ కల్చరల్ అకాడమీ నుంచి రాష్ట్రీయ పురస్కార్–2025 అవార్డు అదుకున్నారు. విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఆ సంస్థ ప్రతి ఏటా అవార్డులు అందజేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వేదికగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ టి.అమర్నాథ్ గౌడ్, తెలంగాణ మాజీ మంత్రి వేణుగోపాల్ ఆచార్య, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్ చేతుల మీదుగా తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అవార్డు అందుకున్నారు.

బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.1,00,116 విరాళం



డీడీని స్విమ్స్ డైరెక్టర్‌కు అందజేస్తున్న రాఘవేంద్ర

తిరుపతి తుడా: తిరుపతి స్విమ్స్‌లోని శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాద్‌కు చెందిన కృష్ణ అగర్వాల్ రూ.1,00,116 విరాళం ఇచ్చారు. డీడీని శనివారం తన మిత్రుడు, తిరుపతి వాస్తవ్యులు వై.రాఘవేంద్ర ద్వారా స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్వీ కుమార్‌కు అందజేశారు.

ఎస్పీడబ్ల్యూలో ముగిసిన స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. సుమారు 200 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు సమాచారం. విద్యార్థులు పదిలో సాధించిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు.


ఆకట్టుకున్న బకాసుర వధ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం బకాసుర వధ కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. శ్రీవేంకటేశ్వర నాటక కళామండలికి చెందిన వారు భీముడి వేషధారణలో ఎడ్ల బండిపై నిలబడి గ్రామంలోకి ఊరేగింపుగా వచ్చారు. డప్పులు, పంబలు కొడుతూ గ్రామంలో ప్రదర్శనగా రావడంతో గ్రామస్తులు భక్తితో అన్నం సమర్పించారు. బకాసుర వధ కార్యక్రమానికి ఉభయదాతగా వ్యవహరించిన దేశిరెడ్డి ఇంటి వద్ద భీముడి వేషధారుడికి పుష్పాభిషేకం నిర్వహించిన తరువాత వేడుకగా గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్ రెడ్డి, పూజారి జయకుమార్ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వైద్య పరీక్షలు

తిరుపతి మంగళం : తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ సిబ్బందికి శనివారం అమర హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు చేసినట్లు ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వార్షిక మెడికల్ చెకప్ చేయడానికి అమర ఆస్పత్రి వైద్యులు ముందుకు రావడం హర్షణీయమని తెలిపారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గొరినేని ప్రసాద్, ఎండీ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండటమే జీవితంలో నిజమైన విజయం సాధించడమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్, ఆర్ఐలు కృపానంద, సాయి గిరిధర్, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆస్పత్రి జీఎం ఆనంద్, సీఈవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్



ఆలయం వెలుపల ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయి జాకి

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయి జాకి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లుచేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అదేవిధంగా రాష్ట్ర హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, సినీ నటి నిరోషా, ప్రభుత్వ విప్ శ్రీధర్ తిరుమలేశుని దర్శించుకున్నారు.

దుస్థితిలో సంక్షేమ హాస్టళ్లు

కనీస వసతులు లేని భవనాలు.. దుర్గంధం వెదజల్లే మరుగుదొడ్లు.. ఈగలు ముసురుతున్న వంటగదులు.. పట్టపగలే స్వైర విహారం చేస్తున్న దోమలు.. సక్రమంగా తిరగని ఫ్యాన్లు.. అరకొరగా వెలిగే దీపాలు.. రెక్కలు విరిగిన కిటికీలు.. పేరుకున్న మురుగు.. పక్కనే తాగునీటి కొళాయిలు.. ఇవీ సంక్షేమ హాస్టళ్లలోని పరిస్థితి. వసతి గృహాల్లోని పిల్లలు అష్టకష్టాలు పడుతున్నా కూటమి సర్కారుకు పట్టడం లేదు. తిరుపతిలోని వసతిగృహాల్లోని పరిస్థితులపై బుధవారం రాత్రి సాక్షి పరిశీలించింది. అక్కడి పిల్లలు పడుతున్న అనేక ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి.

- కనిపించని కనీస సౌకర్యాలు
- ఇప్పటికీ అందని కాస్మొటిక్ చార్జీలు
- దోమలతో జ్వరాల బారిన పడుతున్న పిల్లలు
- పట్టించుకోని అధికారులు



బట్టలు ఉతక్కుంటున్న పిల్లలు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలోని చెన్నారెడ్డికాలనీలోని ఎస్సీ బాలికల–1 హాస్టల్‌లో 143 మంది పిల్లలు ఉన్నారు. అటెండర్ మాత్రమే ఉండడంతో పిల్లలే అన్నం వడ్డించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పరిసరాలు పరిశుభ్రంగా వున్నాయి. ఆర్వో ప్లాంట్ నామమత్రాంగా ఉంది. దుప్పట్లు లేకపోవడంతో రాత్రిళ్లు దోమలు, చలికి అవస్థలు పడుతున్నారు. ఎస్సీ బాలికలు–2, ఎస్సీ కళాశాలకు చెందిన బాలికలు–2 హాస్టళ్లలో 154 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరైన భోజనం పెట్టడం లేదు. మరమ్మతు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. బీసీ బాలికల హాస్టల్‌లో 144 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి తగినంత భోజనం పెట్టడం లేదు. నీళ్ల సాంబారు పెడుతున్నారు. సిబ్బందిని అడిగితే రెండు నెలలు నుంచి బిల్లలు రావడం లేదని, అప్పులు చేసి వస్తువులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వుందని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ సమీకృత బాలుర హాస్టల్‌లో 320 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. పారిశుద్ధ్యం లోపించింది. ముళ్ల పొదలు ఉండడంతో పాములు వస్తున్నట్టు విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత సర్కార్ పిల్లలకు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించడానికి ట్యూటర్లను ఏర్పాటు చేసింది. ఒక్కొక్కరికి రూ.1500 ఇచ్చేవారు. కూటమి సర్కార్ నిధులు ఇవ్వకపోవడంతో వారు పనిచేయడం లేదు.



భోజనం కోసం క్యూలో పిల్లలు



గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న పిల్లలు



దెబ్బతిన్న ఆర్వో ప్లాంట్



అధ్వానంగా బాత్‌రూమ్

తిరుపతి జిల్లాలోని హాస్టళ్ల సమాచారం		
హాస్టళ్లు	సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ హాస్టళ్లు	60	4984
బీసీ హాస్టళ్లు	65	5060
ఎస్టీ హాస్టళ్లు	23	4778
గురుకులాలు	10	5,975



అధ్వానంగా వంటగది



నిద్రపోతున్న పిల్లలు..దుప్పట్లు వారు ఇంటి నుంచి తెచ్చుకున్నవే

వెంకన్న కరుణిస్తే చానా పెద్దోన్నైపోతా





కింగ్డమ్ సినిమా ట్రైలర్ లాంచ్ లో వేదికపై హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

- హీరో విజయ్ దేవరకొండ ఆశాభావం
- వేడుకగా కింగ్డమ్ సినిమా ట్రైలర్ రిలీజ్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుమల వెంకన్న సామి పక్కన వుండి నడిపిస్తే నేను చానా పెద్దోన్నైపోతానని హీరో విజయ్ దేవరకొండ ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ మైదానంలో శనివారం సాయంత్రం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మాత సూర్యదేవర నాగవంశీ నిర్మించిన కింగ్డమ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో చిత్తూరు జిల్లా యాసతో మాట్లాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తిరుపతి ఎట్లా ఉండాది, అందరూ బాగుండాలి..ఈ తూరి మీవద్దకే వచ్చా.. మీ అరుపులు, కేకలు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందప్పా అంటూ యువతను ఉద్దేశించి మాట్లాడారు. సినిమా గురించి ఆలోచిస్తుంటే నాకు ఒక్కటే అనిపిస్తోందని సినిమా విడుదల ముందు వేంకన్నస్వామి దయ ఉండాలని కోరారు. ప్రాణం పెట్టి తీసిన సినిమాలో రచయిత, దర్శకుడు గౌతం తిన్ననూరి, మ్యూజిక్ అందించిన అనిరుథ్, నిర్మాత వంశీ వంటి గొప్పోళ్లున్నారని తెలిపారు. హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ తాను నటించిన తొలి సినిమా ట్రైలర్ తిరుపతి శ్రీవారి చెంతన విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. నిర్మాత వంశీ మాట్లాడుతూ ఈ సినిమా నిర్మించడానికి ఎంతో కష్టపడ్డామని తెలిపారు. గతంలో అర్జున్‌రెడ్డి సినిమాను తలిపించేలా కింగ్డమ్ వుంటుందన్నారు. అనంతరం సినీ హీరో విజయ్ దేవరకొండను అభిమానులు గజమాలతో సత్కరించారు. ముందుగా ప్రముఖ యాంకర్ సుమ ట్రైలర్‌ను అభిమానుల మధ్య ప్రారంభించింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

టేప్ ఎక్స్‌పో ప్రారంభం



టేప్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ద అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్(టేప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల టేప్ ఎక్స్‌పో–2025 శనివారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ డెవలప్‌మెంట్ చైర్మన్ సీఆర్.రాజన్, గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వివిధ కంపెనీలకు చెందిన సుమారు 70 స్టాల్స్‌తో భవన నిర్మాణానికి సంబంధించిన ఆధునిక టెక్నాలజీ పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ద అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్, ఇంజినీర్స్ చైర్మన్ వెంకటేష్‌బాబు, అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి షణ్ముగం, కోశాధికారి సందీప్, నాగేశ్వర రావు, నరేష్, డెప్యూటీ మేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

తిరుపతి గాంధీ రోడ్డు: తిరుపతి నగరంలోని కపిల్ తీర్థం సమీపంలో వున్న అమరవీరుల స్తూపం వద్ద శనివారం కార్గిల్ విజయ దివస్‌ను బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, సుధాకర్, ఏవన్ మస్తాన్, లోక ప్రభాకర్ నాయుడు, పురోహితుడు సురేష్‌స్వామి, చంద్రబాబు నాయుడు, కన్నప్పగారి కేశవులు రెడ్డి శాంబోల హరినాథ్ పాల్గొన్నారు.

మొగరాలలో …

పాకాల : మండలంలోని మొగరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకుని శనివారం కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు విడిచిన వీర సైనికులకు ఘనంగా నివాళులు అర్పించారు. పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమలత పాల్గొన్నారు.



మొగరాలలో కార్గిల్ విజయ దివస్ నిర్వహిస్తున్న విద్యార్థులు

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక చంద్రగిరి టవర్‌క్లాక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో కార్గిల్ విజయం దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు వెంకటముని, జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, మండల అధ్యక్షుడు మునిరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్, మండల ఉపాధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రబులిచ్చిన డబుల్ ఇంజిన్ సర్కార్



మాట్లాడుతున్న తులసీరెడ్డి

తిరుపతి కల్చరల్: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వాలకు రైతుల బాధలు పట్టడం లేదని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసీరెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం మిర్చి, పొగాకు, మామిడి, చీనీ, పసుపు పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు. పంటల బీమా పథకం అమలు కావడం లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదని, యూరియా కొరత తీవ్రంగా ఉందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేలు ఆర్థిక సాయం చేస్తామని కూటమి పార్టీలు ఎన్నికల్లో పేర్కొన్నాయని, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా 20 పైసలు కూడా సాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు మళ్లించడం దారుణమన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ కాస్త ట్రబుల్ ఇంజిన్ సర్కార్‌గా మారిపోయిందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని తెలిపారు. సుపరిపాలన పదానికి అర్థం లేకుండా పోయిందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బనకచెర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలు చిట్టిబాబు, టి.వెంకట నరసింహులు, చంద్రశేఖర్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతిలో ఆగస్టు 1 నుంచి ఆటోమెటిక్ మ్యుటేషన్



శ్రీరామకుమార్, జిల్లా రిజిస్ట్రార్

తిరుపతి అర్బన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆగస్టు ఒకటి నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ అనంతరం ఆటోమెటిక్ మ్యుటేషన్ ప్రక్రియను అమలు చేస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ అయిన తర్వాత మ్యుటేషన్ ప్రక్రియ 15–30 రోజులు పడుతుందన్నారు. ఈ క్రమంలో ఆటోమెటిక్ మ్యుటేషన్ పద్ధతిని ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. మ్యుటేషన్ చేయడానికి ఆస్తి విలువను బట్టి ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా లెక్కిస్తామన్నారు. ఈ విధానం ద్వారా దానం చేసిన, విక్రయాలు జరిగినా, పరివర్తన దస్తావేజులు సైతం రిజిస్ట్రేషన్లు జరిగిన తర్వాత ఆస్తి పూర్తిస్థాయిలో బదలాయింపు అయిన తక్షణం కొనుగోలుదారుడు పేరిట మ్యుటేషన్ అవుతుందని వివరించారు. ఈ కొత్త పద్ధతిని ఐజీఆర్ఎస్.జీవోవీ.ఇన్, ఏపీఐతో ఇంటిగ్రేట్ చేయడం ద్వారా సరళీకృతం చేశారని తెలిపారు. ఈ ప్రక్రియ ఆస్తి పన్ను, యాజమాన్య వివరాలను ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉపయోగించి సీడీఎం సిస్టమ్‌లో ఇంటిగ్రేట్ చేస్తుందని స్పష్టం చేశారు.

బాలాజీనగర్ సమీపంలో చిరుత సంచారం

తిరుమల: తిరుమలలో స్థానికులు నివాసం ఉండే బాలాజీనగర్ చివరల్లో, టీటీడీ బ్యాటరీ స్టేషన్ సమీపంలో చిరుత సంచారం శనివారం రాత్రి కలకలం సృష్టించింది. రాత్రి అకస్మాత్తుగా చిరుత కనపడడంతో అటుగా వెళుతున్న వాహన చోదకులు భయాందోళనలకు గురయ్యారు. అనంతరం కొంత సేపటికే చిరుత సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు టీటీడీ డీవైఈఆర్వో మధుసూదన్ తెలిపారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో చిరుతల సంచారం కనపడడం గమనార్హం.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను చేపట్టారు.

వైపిలో తిరుపతి విద్యార్థి ప్రతిభ



విద్యార్థి గోపీచంద్‌కు అవార్డు అందజేస్తున్న వైపి సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: యంగ్ ఇండియన్స్ ఛాప్టర్ ఆధ్వర్యంలో వైజాగ్ గీతం యూనివర్సిటీ వేదికగా జరిగిన నీటి సంరక్షణ, సంక్షోభాన్ని అధిగమించడానికి స్థిరమైన పరిష్కారాలు అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో తిరుపతి కరంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాల విద్యార్థి పి గోపీచంద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థి మాట్లాడుతూ జాతీయ స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సూపర్‌సిక్స్ హామీలకు పంగనామం

చంద్రగిరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు పంగనాలమాలు పెట్టి, దగా చేస్తోందని సీపీఐ నాయకులు మండిపడ్డారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కానున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శత జయంతి వేడుకలను జరుపుకుంటున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక చంద్రగిరి మిట్టగంగమ్మ ఆలయ ఆవరణలో ప్రథమ మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథ రెడ్డి, జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఈ 100 ఏళ్ల కాలంలో అనేక సమస్యలపై పోరాటాలు చేసి.. విజయాలు సాధించిన ఘనత సీపీఐదే అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా విశ్వనాథ్, పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, రవి, కేవై రాజా, శివ, గోవింద స్వామి, పద్మనాభం, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేంకటేశ్వర మహత్యం నాటకం



శ్రీవేంకటేశ్వర మహత్యం పద్యనాటకంలోని దృశ్యం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ జాతీయ నాటకోత్సవాలు శనివారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీవేంకటేశ్వర మహత్యం' పౌరాణిక పద్యనాటకం ఆకట్టుకుంది. తిరుమల శ్రీవారిని భక్తితో ప్రార్థిస్తే కరుణిస్తాడన్న విషయాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం కొలకలూరి శ్రీసాయి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' సాంఘిక నాటిక సందేశాత్మకంగా సాగింది. కళాకారులను నిర్వాహకుడు బీఎస్.రెడ్డి జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.

కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌కు అభినందన

తిరుపతి రూరల్: కార్మికశాఖ తిరుపతి డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌ను సీఐటీయూ, స్విమ్స్ కార్మిక సంఘాల నేతలు అభినందించారు. తిరుపతిలో కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం కోరారు. అనంతరం ఆయనను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు వేణుగోపాల్, స్విమ్స్ నాయకులు ఉన్నారు.

క్యాన్సర్ గ్రిడ్ వార్షిక సమావేశం



సమావేశానికి హాజరైన వైద్యులు, అతిథులు

తిరుపతి తుడా: జాతీయ క్యాన్సర్ గ్రిడ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాప్టర్ 3వ వార్షిక సమావేశం స్థానిక జూపార్క్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(స్వీకార్)లో శనివారం ప్రారంభమైంది. ఇందులో ఏపీ ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 2012లో తిరుపతిలో టాటా మెమోరియల్ సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 19 ఆస్పత్రులు సభ్యులుగా ఉన్నాయని పేర్కొన్నారు. టాటా మెమోరియల్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సీఎస్ ప్రమేష్, డాక్టర్ కైలాష్ శర్మ, డాక్టర్ ఉమేష్ మహంతొట్టి, దినేశ్ కుమార్ పాల్గొని క్యాన్సర్ వ్యాధి చికిత్స, అధునాతన విధానాల అమలుపై చర్చించారు.

28 నుంచి సామాజిక తనిఖీలు

తిరుపతి రూరల్ : మండలంలో ఉపాధి హామీ పనులపై ఈనెల 28 నుంచి సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర, ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జ్యోతిశ్రీ తెలిపారు. వారు శనివారం మాట్లాడుతూ 2024–2025లో ఉపాధి హామీ కింద చేసిన పనులపై విచారణ చేస్తారని తెలిపారు. మాట్లాడుతూ సామాజిక తనిఖీలకు అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఎన్ఎస్‌యూలో స్వామి పరమార్థదేవ్



పరమార్థదేవ్ స్వామికి స్వాగతం పలుకుతున్న వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీని శనివారం హరిద్వార్‌కు చెందిన పతంజలి యోగా సమతి చీఫ్ సెంట్రల్ కోర్డినేటర్ స్వామి పరమార్థదేవ్ సందర్శించారు. ఆయనకు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆయన వర్సిటీలో విద్యార్థులతో సమావేశమై సంవాద డైలాగ్ ఆన్ యోగా అనే అంశంపై ప్రసంగించారు. యోగ శాస్త్రాన్ని ప్రతి విద్యార్థీ అభ్యసనం చేయాలని సూచించారు.

నోటీస్ బోర్డు

- శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఇస్కాన్ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి విద్యార్థులకు నృత్య పోటీలు.
- ఎన్జీవో కాలనీలోని అరబిందో సొసైటీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు టెస్ట్ పరీక్షల్లో టాపర్స్‌కు పతంజలి మెరిట్ స్కాలర్‌షిప్ పంపిణీ.
- అభినయ ఆర్ట్స్ జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా మహతిలో ఉదయం 9.30 గంటలకు నృత్య ప్రదర్శనలు, సాయంత్రం 5 గంటలకు 'స్వేచ్ఛ' నాటిక ప్రదర్శన, రాత్రి 8 గంటలకు విజేతలకు హనుమ అవార్డ్స్ ప్రదానం.